## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పెనమలూరు:** నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ పి.హరిబాబు తెలిపారు. కానూరు శ్రీరామ్‌నగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 6.30 గంటల నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా శ్రీరామ్ నగర్ కాలనీ, కేసీపీ కాలనీ, పోరంకి సాయినగర్, పోలీస్‌స్టేషన్ ప్రాంతం, కామయ్యతోపులో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. స్థానికులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

### నేటితో యోగా శిక్షణ శిబిరం ముగింపు

**కంకిపాడు:** శ్రీ వెంకటేశ్వర యోగ సేవ కేంద్రం గోసాల ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లో నిర్వహిస్తున్న యోగ శిక్షణ శిబిరం శనివారంతో ముగియనున్నట్లు గాయత్రీ విహార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. యోగ సేవ కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగిందన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన 30 మంది శిక్షణ పొందారని పేర్కొన్నారు. ముగింపు కార్యక్రమానికి యోగ శిక్షకులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

### 19న దేవాలయ భూములకు కౌలు వేలం

**పెనమలూరు:** గోసాల-వణుకూరు గ్రామాల్లో దేవాలయ భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన ఆర్‌ఎస్ నెంబర్ 135లో 65 సెంట్లు, వణుకూరు గ్రామంలో సోమేశ్వర్వామివారి ఆలయానికి చెందిన ఆర్‌ఎస్‌నెంబర్ 212లో 1.96 ఎకరాలు, వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన ఆర్‌ఎస్ నెంబర్ 294లో 3.80 ఎకరాలు, చెక్కా వెంకట కోటయ్య ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆర్‌ఎస్ నెంబర్ 305/5లో 2.07 ఎకరాల భూములు 2023-2024, 2025-2026 సంవత్సరాలకు బహిరంగ వేలం ఈ నెల 19వ తేదీ ఉదయం 9 గంటలకు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన పాటదారులు దరావత్తు చెల్లించి ఆయా ఆలయాల ప్రాంగణంలో వేలంలో పాల్గొనవచ్చన్నారు.

### యువతి అదృశ్యంపై కేసు నమోదు

**పెనమలూరు:** కానూరులో యువతి అదృశ్యంపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సనత్‌నగర్‌కు చెందిన ఇస్మాయిల్, ఎండి.హతీమాబేగం భార్యాభర్తలు. భర్త ఆటోనగర్‌లో టింకరింగ్ పనులు చేస్తాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, వారి పెద్ద కుమార్తె షంషాబేగం (19) ఈ నెల 14వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. గతంలో వీరు హైదరాబాద్‌లో ఉన్న సమయంలో హరి అనే యువకుడితో షంషాబేగంకు పరిచయం ఉంది. దీని కారణంగానే షంషాబేగం కనిపించటం లేదని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

### ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ



**పెనమలూరు:** వేసవి తీవ్రను దృష్టిలో ఉంచుకుని వైద్య శాఖ ఆధ్వర్యంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారు. పీహెచ్‌ఎన్ లక్ష్మి వివరాలు తెలుపుతూ... వేసవి తీవ్రత కారణంగా 5 సంవత్సరాల లోపు చిన్నారులు, గర్భిణులు, వృద్ధులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు గ్రామాల్లో పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వేసవి తీవ్రతను తగ్గించటానికి వృద్ధులు, చిన్నారులకు తగిన సూచనలు ఇస్తున్నామని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నామన్నారు. పెనమలూరు పల్లిపేట అంగన్‌వాడీలో చిన్నారులకు ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందచేశారు. వైద్య సిబ్బంది శ్రీరామ్, పద్మావతి, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

### దోమల నిర్మూలనతో ప్రజారోగ్యానికి భద్రత



**కంకిపాడు:** దోమల నిర్మూలనతోనే ప్రజారోగ్యానికి భద్రత చేకూరుతుందని జిల్లా మలేరియా అధికారి రామారావు అన్నారు. ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ఈడుపుగల్లు గ్రామంలో శుక్రవారం వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి విస్తృతంగా పర్యటించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సంస్థ ఐఐటీ అకాడమీని సందర్శించి దోమల నిర్మూలన చర్యలపై అవగాహన కల్పించారు. భవనం గోడలు, పరిసరాల్లో మెలాథియన్ మందు పిచికారీ చేయించారు. రామారావు మాట్లాడుతూ దోమల నిర్మూలనకు మెలాథియన్ మందు ఉపకరిస్తుందన్నారు. దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించి నిర్మూలన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ ఆంజనేయులు, ఏఎన్‌ఎం అనిత పాల్గొన్నారు.

## ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం



అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు చెక్‌ల అందజేత

**నున్న(విజయవాడరూరల్):** విద్యలో ప్రతిభ కనబరిచే వారిని మరింత ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావడం ముదావహమని ఆంధ్రప్రదేశ్ మండల విద్యాశాఖాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆదూరి వెంకటరత్నం అన్నారు. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అధిక మార్కులు సాధించడంలో జిల్లా, రాష్ట్ర స్థాయికి పోటీపడాలన్నారు. విజయవాడ రూరల్ మండలం నున్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన పొందిన బెజవాడ శ్రీరామ్(577) మార్కులు, మహ్మద్ సాయి సమీర్(572) మార్కులు మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు, గన్నవరం నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, తృతీయ స్థానాలు సాధించారు. వీరిద్దరికి హైస్కూల్ పూర్వ విద్యార్థిని, అడ్వకేట్ గోవిందు శారద తన తల్లి గోవిందు చిన్నమ్మాయి పేరిట ఏటా ఇచ్చే నగదు పురస్కారం రూ.5వేలు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం వి.భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ముమ్మరంగా కాలువ పూడికతీత పనులు



పూడికతీత పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ శీలం రంగారావు

**రామవరప్పాడు:** విజయవాడరూరల్ మండలం నిడమానూరులో రైవస్ కాలువలోకి వెళ్లు పంట కాలువలో రెండు రోజులుగా పూడికతీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మిషన్ సహాయంతో జరుగుతున్న ఈ పనులను సర్పంచ్ శీలం రంగారావు, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ రైతులకు, గ్రామస్తులకు ఉపయోగపడే ప్రధాన కాలువ పూడిపోవడంతో ఈ పనులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని మురుగు ఈ కాలువలో కలుస్తుందని, ప్రస్తుతం కాలువ పారుదలకు నోచుకోకపోవడంతో యుద్ధప్రాతిపదికన పూడికతీత పనులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పనుల ద్వారా గ్రామంలోని డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా పారుదలకు నోచుకుంటుందని తెలిపారు.

## గృహ నిర్మాణాల వేగం పెరగాలి



మాట్లాడుతున్న డీఈ నాగమల్లేశ్వరావు

**విజయవాడరూరల్:** నున్న గ్రామంలోని జగనన్న లేఅవుట్ నందు ఇళ్ల నిర్మాణాల వేగం పెరగాలని గృహ నిర్మాణ శాఖ డీఈ నాగమల్లేశ్వరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం గృహ నిర్మాణాలకు సంబంధించిన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యానికి తగిన విధంగా ఇళ్ల నిర్మాణాలు జరగాలంటే లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వం అందజేస్తున్న మెటీరియల్స్ వివరాలు తెలియజేయాలన్నారు. ఇప్పటి వరకు 913 మాత్రమే ఇంటి నిర్మాణాలు పూర్తయినట్టు పేర్కొన్నారు. ప్రతి వారం టార్గెట్ నిర్ణయించుకుని ఇళ్ల నిర్మిస్తే మంచి ఫలితాలుంటాయన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీ బీవీ శేషగిరిరావు మాట్లాడుతూ ప్రభుత్వం లబ్ధిదారులకు బిల్లులను విడుదల చేస్తుందన్నారు. లబ్ధిదారుల్లో ఈ విషయంపై అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యే విధంగా చూడాలన్నారు.

## హీరో ప్యాషన్ ప్లస్ బైక్ ఆవిష్కరణ



వినియోగదారుడికి బైక్ తాళం ఇస్తున్న దృశ్యం

**పెనమలూరు:** ప్రపంచంలో టూ వీలర్ నెంబర్ 1గా ఉన్న హీరో మోటార్స్ 100 సీసీ ప్యాషన్ ప్లస్ బైక్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కానూరు సాయి స్వర్ణిక హీరో మోటార్స్ షోరూమ్‌లో జరిగిన కార్యక్రమంలో హీరో ఏపీ సర్కిల్ ఏరియా మేనేజర్ గోపాలకృష్ణ, విజయవాడ టూవీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫిరోజ్, సాయి మోటార్స్ మేనేజింగ్ పార్టనర్స్ డి.సందీప్‌బాబు, ఆంజనేయదాస్ నూతన బైక్‌ను ఆవిష్కరించారు. ఆధునిక టెక్నాలజీతో మార్కెట్‌లో అడుగు పెట్టిన బైక్‌ను ముగ్గురు కస్టమర్లు గోపాలకృష్ణ, షేక్.ఇర్ఫాన్, కృష్ణకాంత్‌కు అందచేశారు. బుకింగ్స్, టెస్టు డ్రైవ్ షోరూమ్ వద్ద అందుబాటులో ఉందని తెలిపారు.

## ఇంద్రకీలాద్రిపై భక్తజన సందడి



చండీ హోమంలో పాల్గొన్న భక్తులు



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వరస్వామి వార్లను శుక్రవారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఆది దంపతులను దర్శించుకునేందుకు తరలి వచ్చిన భక్తులతో పాటు ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలతో ఇంద్రకీలాద్రిపై రద్దీ నెలకొంది. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగింది. తెల్లవారుజామున ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీ చక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీ హోమాలను ఉభయదాతలు తమ నామగోత్రాలతో జరిపించుకున్నారు. దేవస్థాన కేశఖండనశాలలో తలనీలాలు సమర్పించిన పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్నారు. సర్వదర్శనంతో పాటు రూ.100, రూ.300, రూ.500 టికెట్లు కొనుగోలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం మొక్కులు చెల్లించుకోవడంతో పాటు మహా మండపం రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచ హారతుల సేవ, పల్లకీ సేవ, దర్బారు సేవలోనూ భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

## నైపుణ్యాభివృద్ధితో ఉపాధి అవకాశాలు




మాట్లాడుతున్న ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** యువతలో నైపుణ్యాభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు మెరుగు పరచడానికి స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే, ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యాన స్కిల్ హబ్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో స్కిల్ హబ్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. దీనిలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారని తెలిపారు. ప్రస్తుత కాలంలో చదువుతో పాటు కమ్యూనికేషన్స్ స్కిల్స్ అవసరం ఉందన్నారు. పరిశ్రమల్లో ఉపాధికి ప్రతిఒక్కరూ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని అప్పుడే పరిశ్రమల్లో యువత ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుంటారని తెలిపారు. స్కిల్ హబ్ సేవలను నిరుద్యోగ యువత వినియోగించుకుని లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, జిల్లా నైపుణ్యాభిసంస్థ అధికారి డాక్టర్ నరేష్‌కుమార్, విజయదీప్, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతతో విగ్రహ నిర్మాణ పనులు

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ క్వాలిటీ కంట్రోల్ అధికారులను ఆదేశించారు. నగరంలోని స్వరాజ్య మైదానంలో నిర్మిస్తున్న అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను ఆయన శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్మాణ పనులు జరగాలని డిజైనర్లను ఆదేశించారు. కారిడార్ మొత్తంలో జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఇబ్బందులు ఎదురైతే తక్షణమే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. కారిడార్‌లో జరుగుతున్న గ్రానైట్ ఫుట్‌పాత్, ల్యాండ్‌స్కేప్, ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. అంబేడ్కర్ విగ్రహానికి సంబంధించిన అన్ని విడి భాగాలను కలిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

### ముగ్గుల పోటీలు



**గన్నవరం రూరల్:** ప్రజల భాగస్వామ్యంతో జన్ భాగీదారి లక్ష్యాలను నెరవేర్చాలని వీరపనేనిగూడెం సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ చెప్పారు. మండలంలోని వీరపనేనిగూడెం, కొత్తగూడెం గ్రామాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజీరున్నీసా ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలను శోభాయమానంగా తయారు చేశారు. నూతన జాతీయ విద్యా విధానం, జి-20 సదస్సు లక్ష్యాలు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సర్పంచ్ పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, లక్ష్మీ, రాణి, అంజన పాల్గొన్నారు.

### ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ



**పెనమలూరు:** వేసవి సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు శివాలయం వద్ద ప్రయాణికులకు శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. పాదచారులు, వాహనదారులు మజ్జిగతో దప్పిక తీర్చుకున్నారు. ఎమ్మెల్యే పార్థసారథి ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నేత ఆకునూరు సుబ్బారావు 108 కొబ్బరికాయలు దాసాంజనేయస్వామి వారికి కొట్టి పూజలు చేశారు. కార్యక్రమాలలో వైఎస్సార్ సీపీ నేతలు బొర్రారమణయ్య, చుందూరు శేఖర్‌బాబు, వెలగా మల్లి, కోనేరు రమేష్ పలువురు పాల్గొన్నారు.

### బధిరుల పాఠశాలకు బియ్యం అందజేత

**హనుమాన్‌జంక్షన్ రూరల్:** స్థానిక నూజివీడు రోడ్డులోని ఆదిత్య బధిరుల విద్యాలయానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ హనుమాన్‌జంక్షన్ శాఖ ప్రధాన కార్యదర్శి కళ్లేపల్లి నారాయణరావు బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం 25 కిలోల బియ్యంతో పాటుగా ఇతర సరుకులను ఆదిత్య బధిరుల పాఠశాల నిర్వాహకుడు ఆకుల వెంకట రమణకు అందించారు. సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు పాల్గొన్నారు.

### 19 న సినీ దర్శకుడు జంధ్యాల వర్ధంతి సభ

**విజయవాడ కల్చరల్:** కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ, సి.రామ్మోనరావు కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ సోమవారం సినీ దర్శకుడు, నటుడు, మాటల రచయిత జంధ్యాల 22 వర్ధంతి సభను నిర్వహిస్తునట్లు సంస్థ అధ్యక్షుడు పీవీఎల్ నృసింహం, ప్రధాన కార్యదర్శి చివుకుల హరగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌతా పూర్ణానందం వేదికపై జరిగే కార్యక్రమంలో విద్యావేత్త దొంతాల ప్రకాష్‌కు జంధ్యాల స్మారక పురస్కారం, సంప్రదాయ నృత్య ప్రదర్శన పేదలకు అన్నవస్త్ర దానం నిర్వహిస్తునట్లు తెలిపారు. ఆ రోజు ఉదయం తమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద జంధ్యాల విగ్రహం వద్ద పుష్పాంజలి కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

### మెగాజాబ్ మేళాలో 225 మంది ఎంపిక



**మధురానగర్(విజయవాడసెంట్రల్):** మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జవహర్ నాలెడ్జి సెంటర్, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యాన నిర్వహించిన మెగాజాబ్ మేళాలో 225 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన మెగా జాబ్ మేళాకు 710 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 225 మందిని ఎంపిక చేసినట్లు జిల్లానైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ నరేష్ కుమార్ తెలిపారు. టెక్ మహీంద్రా, హెచ్1, హెచ్ఆర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, యాక్సిస్, బైజూస్, అపోలోఫార్మాస్యూటికల్స్, స్మార్ట్ కిడ్స్, ఒకాయా సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, అరబిందో, హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, టీసీఎల్ తదితర కంపెనీల ప్రతినిధులున్నారు.

## పిల్లలను అంగన్‌వాడీలో చేర్చాలని అవగాహన



ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది

**గన్నవరం:** స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాలు-1, 2, 3 ఆధ్వర్యంలో జన భాగీదారి ర్యాలీ నిర్వహించారు. మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్చాలని కోరుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగపద్మావతి మాట్లాడుతూ మూడేళ్ల నుంచి ఆరేళ్ల వరకు పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య అత్యంత విలువైనదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు అవసరమైన పోష్టిక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నట్లు చెప్పారు. ఆటపాటలతో కూడిన విద్యను అందించనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తప్పనిసారిగా తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలని కోరారు. అధికారులు విమలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్.పేర్సి, బీ. అరుణ, బీ. జ్యోతి, టి. మీనా, భవానీ పాల్గొన్నారు.

## ఘన స్వాగతం



టిడ్కో ఇళ్ల పంపిణీకి శుక్రవారం గుడివాడ విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గన్నవరం ఎమ్మెల్యే వంశీమోహన్ పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

## పీజీఈసెట్‌లో విజయ ఫార్మసీ విద్యార్థినుల ప్రతిభ



నిధి రాయ్ 24వ ర్యాంకు



శీలం దీప్తి 36వ ర్యాంకు

**రామవరప్పాడు:** విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళా ఫార్మసీ కళాశాలలో 2019-2023 బీ ఫార్మసీ విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పీజీఈసెట్-2023 పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే పద్మలత తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కళాశాల నుంచి 50 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. వీరిలో 48 మంది విద్యార్థులు అర్హత సాధించారని తెలిపారు. కళాశాల విద్యార్థినులు నిధి రాయ్ 24 ర్యాంకు, శీలం దీప్తి 36వ ర్యాంకు, జోతిక 73వ ర్యాంకు, ఎం.వైష్ణవి 82వ ర్యాంకు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరచారని తెలిపారు.

## కానూరు ఆటోనగర్‌లో అగ్ని ప్రమాదం



కానూరులో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

**పెనమలూరు:** కానూరు ఆటోనగర్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. సాయికృష్ణ ఏజెన్సీ భవనం వెనుక రెల్లి గడ్డి ఎండిపోయి ఉంది. అయితే గడ్డిలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు సాయికృష్ణ ఏజెన్సీ ఉన్న భవనాన్ని చుట్టుముట్టాయి. భవనంలో ఉన్న ఉద్యోగులు భయభ్రాంతులకు గురై వెంటనే ఆటోనగర్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక దళం వచ్చి మంటలు ఆర్పారు. భవనంలో ఉన్న క్వాలిటీ కంట్రోల్ లేబరేటరీ మెటీరియల్ కొంత కాలిపోయింది. అధికారులు ఆస్తి నష్టం వివరాలు అంచనా వేస్తున్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి శంకర్‌రావు, ఆటోనగర్ అగ్నిమాపక అధికారి కె.నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## బోధనా నైపుణ్యం పెంపొందించేందుకు శిక్షణ

**ఉంగుటూరు:** అధ్యాపకుల్లో బోధనా నైపుణ్యం పెంపొందించేందుకు ఆన్‌లైన్ శిక్షణా తరతులు దోహదపడతాయని కళాశాల ప్రిన్సిపాల్ జీవీకెఎస్వీ ప్రసాద్ అన్నారు. ఉంగుటూరు మండలం తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో భారతీయ యువశక్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో అధ్యాపకులకు ఆన్‌లైన్‌లో రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఔత్సాహిక ఇంజినీర్లకు సమర్థవంతమైన మార్గదర్శకులుగా మారడానికి అవసరమైన నైపుణ్యాలు, జ్ఞానంతో అధ్యాపకులను సన్నద్ధ చేసేందుకు శిక్షణ తరగతులను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. 35మంది అధ్యాపకులకు పలు అంశాలపై సూచనలు చేశారనానరు. తొలుత డాక్టర్ సాగర్ కార్యక్రమాన్ని ప్రారంభించగా సివిల్ హెచ్‌ఓడీ కె.వి.శివకుమార్ సమన్వయం చేశారు. కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, డైరెక్టర్ కె.రాజశేఖర్, భారతీయ యువశక్తి ట్రస్ట్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## వడదెబ్బకు గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతుడు

**కంకిపాడు:** వడదెబ్బకు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు... కంకిపాడు ఫ్లై ఓవర్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి (55) అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు గుర్తించి 108లో కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి వర్గాల సమాచారంతో పోలీసులు వెళ్లి విచారించారు. వడదెబ్బ కారణంగా మృతి చెందినట్లు గుర్తించారు. ఈ మేరకు మృతదేహాన్ని ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9440627044 నంబరులో సంప్రదించాలని ఎస్ఐ సుధాకర్ కోరారు.

## గోసాలలో కబరస్తాన్ ప్రహరీ నిర్మాణం



పొక్లెయిన్‌తో పనులు ప్రారంభించిన దృశ్యం

**పెనమలూరు:** గోసాల గ్రామంలో కబరస్తాన్ ప్రహరీ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామ సర్పంచ్ సంగెపు శ్రీనివాసరావు వివరాలు తెలుపుతూ కబరస్తాన్ ప్రహరీ నిర్మాణం చేయాలని మత పెద్దలు కోరటంతో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి వెంటనే స్పందించారన్నారు. కబరస్తాన్ ప్రహరీ నిర్మాణానికి మండల పరిషత్ నిధులు రూ.15 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. దీంతో శుక్రవారం శంకుస్థాపన చేసి ప్రహరీ నిర్మాణం పనులు చేపట్టామన్నారు. చాలా కాలంగా కబరస్తాన్ ప్రహరీ నిర్మాణం చేయాలని మత పెద్దలు కోరినా గత పాలకులు స్పందించలేదని తెలిపారు. వైఎస్సార్ సీపీ పాలనలో దాదాపు వంద అడుగులు ప్రహరీ నిర్మాణం చేపట్టామని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో అభివృద్ధి పనులు చేస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎండి.దాదా, సుభాని, రవూఫ్, పీర్‌అహ్మద్, హాజీ, అసీఫ్ పలువురు పాల్గొన్నారు.

## ముస్లింలకు అధిక ప్రాధాన్యమిస్తున్న జగన్



గుణదలలోని నూరానీ మసీద్ వద్ద 'హర్ దిల్ మే వైఎస్సార్- హమ్ సబ్ జగన్ కే సాత్'

**గుణదల(విజయవాడ తూర్పు):** గడిచిన నాలుగేళ్లలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యమిచ్చారని వక్ఫ్ బోర్డ్ జిల్లా చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ అన్నారు. 'హర్ దిల్ మే వైఎస్సార్- హమ్ సబ్ జగన్ కే సాత్' కార్యక్రమాన్ని గుణదలలోని నూరానీ మసీద్ వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొహిద్దీన్ మాట్లాడుతూ ఎన్ఆర్‌సీ వంటి భారీ విపత్తు నుంచి ముస్లిం మైనార్టీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కాపాడారన్నారు. ఎన్ఆర్‌సీకి వ్యతిరేకంగా అసెంబ్లీ తీర్మానం చేసిన గొప్ప వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. వైఎస్సార్ సీపీ పాలనలోనే ముస్లిం మైనార్టీలకు గౌరవం దక్కుతోందన్నారు. ఈ నేపథ్యంలోనే హర్ దిల్ మే వైఎస్సార్- హమ్ సబ్ జగన్ కే సాత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మా పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్లు ఎండీ మొయిన్, కరీముల్లాబేగ్, సయ్యద్ సమీవుల్లా, మసీదు అధ్యక్షులు యాసిన్‌ఖాన్, కార్యదర్శి యూసఫ్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.